క్లుప్తంగా

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నుంచి చేరికలు



పాయకాపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 62, 63వ డివిజన్లలో టీడీపీ సానుభూతి పరులు వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎల్బీఎస్ నగర్ సెంటర్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీనే అని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో విజయఢంకా మోగించనుందని తెలిపారు. స్థానిక కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, మోదుగుల తిరుపతమ్మ, పార్టీ నాయకులు ఎం గణేష్, విజయ్, జీ శ్రీనివాస్, వీ హైమావతి పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆవిష్కరించారు. బందరు రోడ్డులోని ది కృష్ణాజిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎస్ఎఫ్ఎల్ చైర్మన్, ఏపీ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గౌతంరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సహకార రంగ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. దివంగత మహానేత వైఎస్సార్ రూ.2 వేల కోట్లు వెచ్చించి సహకార బ్యాంక్ వ్యవస్థను పునరుద్ధరిస్తే నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార బ్యాంక్ రంగంలో నెలకొన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించారని తెలిపారు. అంతే కాకుండా జాతీయ బ్యాంక్ ఉద్యోగుల జీతాలకు సమానంగా సహకార బ్యాంక్ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నారన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కోనేరు బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ.. సహకార బ్యాంక్ ఉద్యోగుల సర్వీస్‌ను 62 ఏళ్లకు పెంచాలని కోరారు.

ఏఎంసీ 62వ డివిజన్ అధ్యక్షుడిగా షేక్ ఖాజా

పాయకాపురం(విజయవాడసెంట్రల్): ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) 62వ డివిజన్ అధ్యక్షుడిగా షేక్ ఖాజాను నియమిస్తూ ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా ఆదివారం నియామక పత్రం అందజేశారు. ప్రకాష్‌నగర్ సెంటర్ మానస హోటల్ సమీపంలో ఏఎంసీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్‌అలీ, సభ్యుడు షేక్ బిలాల్, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

పాయకాపురం(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నం రామకోటేశ్వరరావు అన్నారు. పాయకాపురంలో ఆదివారం స్పందన సేవా సమితి నాలుగవ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు, ఇరువురికి ట్రై సైకిళ్లు, ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్, వై సూర్యనారాయణ, కృష్ణప్రసాద్, బీ సుబ్బారావు, యశోద, సుజాత, పూర్ణరాజు పాల్గొన్నారు.

ప్రజాకాపునాడు 27వ డివిజన్ కమిటీ ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కాపునాడు 27వ డివిజన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. దుర్గాపురంలో ఆదివారం ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో డివిజన్ కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా పీ బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శిగా మండా రాము, ఉపాధ్యక్షులుగా కఠారి దుర్గాప్రసాద్, కురిటి శివను ఎన్నుకున్నారు.







భక్త జనసంద్రం.. గుణదల పుణ్యక్షేత్రం

గత మూడు రోజులుగా జరుగుతున్న మేరీమాత శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. విదేశాలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది క్రీస్తు విశ్వాసులు పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. దీంతో గుణదల కొండ భక్తజనసంద్రమైంది. ఫాదర్లు నిర్వహించిన సమష్టి దివ్య బలి పూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొని దైవ సందేశాన్ని ఆలకించారు. దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో మరియతల్లి స్వరూపాన్ని భక్తులు దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







భారతీయ సమాజానికి మూలం వేదం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

విజయవాడ రూరల్: వేద విజ్ఞానం వేలాది సంవత్సరాలుగా భారతీయ సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కొత్తూరు తాడేపల్లిలో శ్రీ సుందర హనుమాన్ షణ్ముఖ వేద విద్యాలయం 21వ వార్షికోత్సవాల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ భారతదేశంలో వేల ఏళ్లుగా వేద విజ్ఞానం పరఢవిల్లుతోందని పేర్కొన్నారు. విశ్వ మానవ శ్రేయస్సు కోసం దేవుడు వేదాలను సృష్టించారని వివరించారు. పరిశోధకులకు అంతుచిక్కని విద్య, వైజ్ఞానం, సామాజిక, ఆర్థిక పరమైన అంశాలు వేదాల్లో దాగున్నాయన్నారు. అజ్ఞానంలో ఉన్న మానవుడిని విజ్ఞానం వైపు నడిపేవి వేదాలేనని అన్నారు. వేద విద్య వ్యాప్తికి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ విశేష కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వేదాల్లోని విజ్ఞానం సామాన్య ప్రజలకు అందేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి భారతీ కల్యాణ వేదిక ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ విష్ణుభట్ల లక్ష్మీనారాయణ, గోపిశెట్టి మల్లయ్య, తూనుగుంట్ల శ్రీనివాస్, గప్పగంతుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్యకర జీవనం సాగించాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు



దుర్గాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆరోగ్యంగా ఉండటానికి వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయుర్వేద, హోమియో చికిత్సలను వివరించారు. సుమారు 300 మంది వృద్ధులు వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు.

చుట్టుగుంటలో..

చుట్టుగుంటలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సౌజన్య హాస్పిటల్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్, అండ్ గరిమెళ్ల లక్ష్మీసమీరా ఈస్ట్ లయన్స్ ఐ హాస్పిటల్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ డీ శ్రీహరిరావు, జిల్లా లయన్స్ గవర్నర్ శంకర్‌గుప్తా ముఖ్య అతిథులుగా పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత మెడికల్ క్యాంపులతో సామాన్య ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని క్యాంపు నిర్వాహకులను అభినందించారు. లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలతో పాటు ప్రజలకు అవసరమైన సేవలు అందజేస్తున్నామని తెలిపారు. లయన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, బీపీ, షుగర్ వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు.

మధుర స్వరాల శాల ఘంటసాల



ఘంటసాల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్, నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. శ్రీ కళాభారతి, పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతి సభను నిర్వహించారు. సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఘంటసాల సంగీత కళావేదిక ద్వారా యువతకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఘంటసాల మాష్టారి గాన మాధుర్యాన్ని నేటితరం గాయనీ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ కృష్ణాజిల్లా కళల కాణాచి అని పేర్కొన్నారు. తెలుగు సినీ చరిత్రలో కృష్ణాజిల్లా స్థానం సుస్థిరమైనదని అన్నారు. హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు ఘంటసాల స్ఫూర్తివంతమైన జీవితం గడిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అనువాద పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు, కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్, ప్రభల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వారంతా పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థులు. 1989–92 విద్యా సంవత్సరంలో పీబీ సిద్ధార్థ కళాశాలలో బీకామ్ చదువుకున్నారు. అప్పుడు బీ కామ్ (చాలా సైలెంట్‌గా ఉండేవారు. 32 సంవత్సరాల తర్వాత ఆదివారం విజయవాడ నగరంలోని ఒక హోటల్‌లో కలుసుకుని, ఆనందంగా గడిపారు. కళాశాల తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలు, ఆనందక్షణాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషించారు. కుశల ప్రశ్నలు, కుటుంబ వివరాలను ఒకరినొకరు తెలుసుకుంటూ రోజంతా ఎంతో ఉత్సాహంగా గడిపారు. వచ్చే ఏడాది మరోసారి కలుసుకుందామంటూ వీడ్కోలు చెప్పుకున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



గీతాలు ఆలపిస్తున్న పూర్వ విద్యార్థినులు

పాయకాపురం(విజయవాడసెంట్రల్): పాయకాపురం శాంతినగర్‌లోని శ్రీ రామకృష్ణ సమితి శ్రీశారదా విద్యాలయంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ముందుగా పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. శారద విద్యాలయం కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. శ్రీరామకృష్ణ సమితి సెక్రటరీ వీ దుర్గాప్రసాద్, అధ్యక్షుడు ఏవీ రాంప్రసాద్, వివేకానంద పాఠశాల హెచ్‌ఎం హరిత, శారద పాఠశాల హెచ్‌ఎం శారద పాల్గొన్నారు.

నేడు 26వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 26వ డివిజన్‌లోని చుట్టుగుంట ముత్యాలమ్మ దేవాలయం నుంచి ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంచార్జి అంగిరేకుల గొల్లభామ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు నగరపాలకసంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొంటారని పేర్కొన్నారు.

శ్రీవాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పాయకాపురం(విజయవాడసెంట్రల్): శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి విశ్వరూప సందర్శన మహోత్సవం(ఆత్మార్పణ) రాజీవ్‌నగర్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే, సెంట్రల్ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణులు ముఖ్య అతిథులుగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కొండపల్లి మురళీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాచి, చల్లార్చిన నీటినే తాగండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర ప్రజలు కాచి, చల్లార్చిన అనంతరం వడబోసిన నీటినే తాగాలని నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ప్రజలు ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం కలిగినా, వాసన వచ్చినా లేదా మురికిగా కనిపించినా వెంటనే దగ్గరలో ఉన్న సచివాలయంలో తెలియజేయాలన్నారు. సచివాలయం సిబ్బంది తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి

విజయవాడ కల్చరల్: భాషా, సంస్కృతి సంప్రదాయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య, సంగీత కళాశాలలో సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ తెలుగు జాతితోనూ సంగీతంతోనూ ఘంటసాల జీవితం ముడిపడి ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఘంటసాల సంగీత కళాశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి మాట్లాడుతూ ఘంటసాల సంగీత కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. తొలుత ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ శర్వాణీమూర్తి, కళాశాల అధ్యాపకులు లక్ష్మీనరసమ్మ, శోభాలక్ష్మి, అమృతకుమార్, సిబ్బంది సుభానీ, అప్పారావు, ఘంటసాల అభిమాన సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత కళాశాల సౌజన్యంతో దుర్గాపురంలోని గోకరాజు గంగరాజు కళావేదికపై ఆదివారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీ గాయకులు ఘంటసాల గీతాలను మధురంగా ఆలపించారు. కార్యక్రమాలను తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ప్రారంభించారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి గాయనీ గాయకులను సత్కరించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనారామన్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

మీట్ ది ప్రెస్‌లో డాక్టర్ కేఏ పాల్



కేఏ పాల్‌ను సత్కరిస్తున్న ఏపీయూడబ్ల్యూజే బాధ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్ఎస్ఎస్ కబంధ హస్తాల్లో బీజేపీ చిక్కుకోవడంతో దేశం ప్రమాదకరమైన స్థితిలో ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఏపీయూడబ్ల్యూజే భవన్‌లో ఆదివారం కేఏ పాల్‌తో మీట్ ది ప్రెస్ జరిగింది. కేఏ పాల్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన స్థితిలో ఉన్న దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు ఎంతో మంది సీనియర్లు ప్రజాశాంతి పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. 54 శాతం ఓటు బ్యాంకు ఉన్న పార్టీగా ప్రజాశాంతి పార్టీ నిలిచిందని చెప్పుకొచ్చారు. మోదీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రజారాజ్యం పార్టీని స్థాపించటం, దాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేయటం వంటివి ఎందుకు చేశారని ప్రశ్నించారు. తాను అధికారంలోకి వస్తే రూ.10 లక్షల కోట్లు ఒక్క సమ్మిట్ ద్వారా తీసుకొచ్చి దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన దగ్గరకు వచ్చి ఎకనామిక్ సమ్మిట్ పెట్టమని కోరితే తాను దానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ స్వస్థత పరచాలని ఆయన్ని పరామర్శించి ప్రార్థించానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాను విశాఖపట్నం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ సభ్యుడు ఎస్‌కే బాబు, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమైనది నర్సింగ్ వృత్తి



విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ల్యాంప్‌లైటింగ్ అండ్ క్యాపింగ్ కార్యక్రమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అతి పవిత్రమైనది నర్సింగ్ వృత్తి అని.. నర్సింగ్ విద్యార్థులు నైటింగేల్ స్ఫూర్తితో వైద్యసేవలు అందించాలని ఏపీ నర్స్ మిడ్‌వైవ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కే సుశీల పిలుపునిచ్చారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం ల్యాంప్‌లైటింగ్ అండ్ క్యాపింగ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె నర్సింగ్ విద్యార్థులకు క్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా విజయ్ నర్సింగ్ స్కూల్‌లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం జర్మనీకి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయ్ ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ టీ శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మస్జీద్‌ల్లో ప్రభుత్వం తరపున ఏర్పాట్లు



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

పాయకాపురం(విజయవాడసెంట్రల్): వచ్చే నెలలో జరగనున్న పవిత్ర రంజాన్ మాసంలో నగరంలోని అన్ని మస్జీద్‌ల వద్ద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేయనున్నామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పేర్కొన్నారు. స్థానిక 63వ డివిజన్ సుందరయ్యనగర్‌లోని మస్జీద్ ఏ నూరే మహ్మదీయ మసీదును ఆదివారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ ప్రత్యేక ఉపవాస ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. మస్జీద్‌లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు ఖాదర్, ఎండీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.